## కృషి డెసిషన్ సపోర్ట్ సిస్టమ్

కృషి డెసిషన్ సపోర్ట్ సిస్టమ్‌ను కేంద్ర మంత్రి ప్రారంభించారు. ఇందులో వేర్వేరు సాంకేతికతలు వ్యవసాయ రంగానికి ఉపయోగపడతాయి. రిమోట్ సెన్సింగ్ ద్వారా చెదలను ముందే గుర్తించవచ్చు. భూ మ్యాపింగ్‌ను చేయవచ్చు. దీని వల్ల పంట నష్టం తగ్గుతుంది. అలాగే గ్లోబల్ పొజిషనింగ్ వ్యవస్థ ద్వారా విత్తనాలు, ఎరువులు ఎంత అవసరమవుతాయో కచ్చితమైన అంచనా వేయవచ్చు. అలాగే కమ్యూనికేషన్ సాంకేతికత కూడా ఇందులో ఉంది. మార్కెట్ ధరలు, వాతావరణ అంశాలను ఎప్పటికప్పుడు రైతులకు అందిస్తారు.

## రోజులు-ప్రాముఖ్యత

**ఆగస్టు 21**

- ఉగ్రవాద బాధితుల జ్ఞాపకార్థం ఏటా ఆగస్టు 21న 'ఇంటర్నేషనల్ డే ఆఫ్ రిమెంబ్రెన్స్ అండ్ ట్రిబ్యూట్ టు ది విక్టిమ్స్ ఆఫ్ టెర్రరిజం' నిర్వహిస్తారు.




**ఆగస్టు 20**

- ఏటా ఆగస్టు 20న ప్రపంచ దోమల రోజుగా నిర్వహిస్తారు. మలేరియా వ్యాప్తికి సంబంధించి 1897లో కీలక పరిశోధనను రొనాల్డ్ రాస్ ప్రకటించారు. ఈ నేపథ్యం లోనే ఈ రోజును ప్రపంచ దోమల రోజుగా నిర్ణయించారు. ఈ పరిశోధన హైదరాబాద్‌లోని బేగంపేటలో అప్పట్లో చేపట్టారు.

**ఆగస్టు 19**

- దేశంలో ఏటా ఆగస్టు 19న సంస్కృత భాషా దినోత్సవంగా నిర్వహిస్తారు. 1969లో తొలిసారి ఈ రోజును ప్రకటించారు. సంస్కృత భాషా పండితుడు పాణిని 2500 జయంతి ఆ ఏడాది అని భావన. ఆయన అష్టాధ్యాయి అనే పుస్తకాన్ని రచించారు. ఈ ఏడాది ఇతివృత్తం 'వేద సంప్రదాయం-వారసత్వం'.

## క్రీడలు



**టీ-20 ప్రపంచకప్**

- ఐసీసీ మహిళల టీ-20 మహిళల కప్‌ను అక్టోబర్ 3 నుంచి 20 వరకు దుబాయ్, షార్జాల్లో నిర్వహించనున్నారు. ఈ క్రీడలు బంగ్లాదేశ్‌లో జరగాల్సింది. ఆ దేశంలో రాజకీయ అనిశ్చితి నెలకొనడంతో అక్కడ నుంచి క్రీడా వేదికను మార్చారు.

**పారాలింపిక్స్**

- ఆగస్టు 28న పారిస్‌లో ప్రారంభమయ్యే పారాలింపిక్స్ భారత జట్టుకు చెఫ్ డి మిషన్‌గా సత్యప్రకాశ్ సంగ్వాన్ నియమితులయ్యారు. భారత్ నుంచి 84 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు.

## అంతర్జాతీయం

**పన్ను సహకారం**

- అంతర్జాతీయ స్థాయిలో పన్ను అంశంలో సహకారానికి ఐక్యరాజ్యసమితి ఒక తాత్కాలిక కమిటీని నియమించింది. అంతర్జాతీయ స్థాయిలో ఒక చట్టబద్ధమైన, ఆమోదయోగ్యమైన, సమ్మిళితమైన, ప్రభావవంతమైన పన్ను విధానాన్ని తీసుకొచ్చేందుకు ఇది ఉద్దేశించింది.

**కార్బన్ తొలగింపు బాండ్**

- అమెజాన్ నది పరీవాహక ప్రాంతంలో కర్బన ఉద్గారాల తొలగింపునకు ప్రపంచ బ్యాంక్ 'కార్బన్ తొలగింపు బాండ్'లను విడుదల చేసింది. 225 మిలియన్ డాలర్ల విలువైనవి ఇవి. తొమ్మిది సంవత్సరాల కాల వ్యవధిలో ఉంటాయి. పర్యావరణంలో వచ్చిన మార్పులు, పెరిగిన కొత్త చెట్లపై తిరిగి ఎంత డబ్బు వస్తుందన్న అంశంపై ఆధారపడి ఉంటుంది. కార్బన్ క్రెడిట్ల అమ్మకం ద్వారా కూడా బాండ్ కొన్నవాళ్లకు నగదు వస్తుంది.

**ఐఎంఎఫ్**

- 2027 నాటికి భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుందని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ ఫస్ట్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ గీతా గోపీనాథ్ పేర్కొన్నారు. 2023-24లో భారత ఆర్థిక పురోగతి ఊహించిన దానికంటే మెరుగ్గా ఉందని ఆమె పేర్కొన్నారు. రానున్న 5-6 సంవత్సరాల్లో అదనంగా లక్షల సంఖ్యలో ఉద్యోగాల సృష్టి ఉండాలని ఆమె సూచించారు. భారత్‌లో వినియోగం పెరుగుతుండటంతో వృద్ధి మెరుగ్గా ఉందని వెల్లడించారు.



**నేపాల్**

- నేపాలీ భాష, సంస్కృతి, సాహిత్యం, తత్వాలపై పరిశోధన చేసేందుకు బెనారస్ హిందూ యూనివర్సిటీ, నేపాల్ అకాడమీ మధ్య ఒప్పందం కుదిరింది.

**జపాన్**



- భారత్, జపాన్ మధ్య 2+2 చర్చలు న్యూఢిల్లీలో నిర్వహించారు. భారత రక్షణ, విదేశాంగ శాఖ మంత్రులు, ఇదే హోదాలో జపాన్ మంత్రులతో చర్చలు జరిగాయి. ఈ విధానాన్నే 2+2 అంటారు. భారత్ ఈ తరహా చర్చలు అమెరికా, బ్రెజిల్, యూకే, రష్యా, ఆస్ట్రేలియా దేశాలతో కూడా నిర్వహిస్తుంది. ప్రస్తుతం జపాన్‌తో జరిగిన సమావేశంలో సైబర్ భద్రతతో పాటు తీరంలో భద్రతా అంశాలు, అంతర్జాతీయ స్థాయిలో సహకారం తదితరాలను చర్చించారు. పరస్పర ప్రయోజనం ఉన్న అంతర్జాతీయ అంశాల్లో సహకరించుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించాయి.

**దక్షిణాఫ్రికా**

- నాటల్ ఇండియన్ కాంగ్రెస్ ఏర్పాటై 130 సంవత్సరాలు పూర్తయ్యింది. 1894 ఆగస్టు 22న దీన్ని మహాత్మాగాంధీ ఏర్పాటు చేశారు. జాతి వివక్షకు వ్యతిరేకంగా పోరాడేందుకు దీన్ని నెలకొల్పారు. నాటల్ అనేది దక్షిణాఫ్రికాలోని ప్రావిన్స్ పేరు.

**ఆఫ్రికా**

- భారత్, ఆఫ్రికా మధ్య రానున్న ఏడేళ్లలో వాణిజ్యాన్ని 200 బిలియన్ డాలర్లకు చేర్చాలని భారత్, ఆఫ్రికా నిర్ణయించాయి. 19వ సీఐఐ ఇండియా-ఆఫ్రికా బిజినెస్ సదస్సు న్యూఢిల్లీలో జరిగింది. ఇప్పటికే ఆఫ్రికాలోని 40 దేశాలకు సుమారు 12 మిలియన్ డాలర్ల లైన్ ఆఫ్ క్రెడిట్ భారత్ ఇచ్చింది.

## జాతీయం

**జన్ పోషణ్ కేంద్రాలు**

- రేషన్ దుకాణాలకు జన్ పోషణ్ కేంద్రాలు అని పేరు పెట్టనున్నారు. ప్రయోగాత్మకంగా గుజరాత్, రాజస్థాన్, తెలంగాణ, యూపీ రాష్ట్రాల్లో 60 ఫెయిర్ ప్రైస్ దుకాణాల్లో ఇది అమల్లోకి వచ్చింది. రేషన్ డీలర్ల ఆదాయాన్ని పెంచేందుకు ఉద్దేశించింది ఇది. దుకాణాల్లో 50% స్థలాన్ని పోషకాహార పదార్థాలు అమ్ముకునేందుకు అనుమతి ఇస్తారు. అలాగే ఎఫ్‌పీఎస్ సహాయ్ అనే అప్లికేషన్‌ను ప్రారంభించారు. రేషన్ దుకాణదారులు ఎలాంటి పూచీకత్తు లేకుండా రుణం తీసుకోడానికి ఉద్దేశించింది. మేరా రేషన్ యాప్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారు. ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన సమాచారాన్ని ఇందులో పొందవచ్చు.

**భారత్‌లో మలేషియా ప్రధాని**

- కార్మిక, ఉద్యోగ, ఆయుర్వేద, సంప్రదాయ ఔషధ, డిజిటల్ సాంకేతికత, సంస్కృతి, పర్యాటకం తదితర అంశాల్లో భారత్, మలేషియా పరస్పరం చర్చించాయి. మలేషియా ప్రధాని అన్వర్ బిన్ ఇబ్రహీం భారత్‌లో పర్యటించారు. ప్రధాని మోదీతో కలిసి ఆయా అంశాలపై చర్చించి ఒప్పందాలను కుదుర్చుకున్నారు.



**ఎంఆర్‌సీసీ**

- మారిటైం రెస్క్యూ కో ఆర్డినేషన్ సెంటర్‌ను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించారు. ఇది చెన్నైలో ఉంది. అలాగే రీజనల్ మెరైన్ పొల్యూషన్ రెస్పాన్స్ సెంటర్‌ను కూడా ప్రారంభించారు. పుదుచ్చేరిలో కోస్ట్ గార్డ్ ఎయిర్ ఎన్‌క్లేవ్‌ను కూడా ఈ సందర్భంగా ప్రారంభించారు.

**స్థూల పర్యావరణ ఉత్పత్తి సూచీ**

- దేశంలో తొలిసారి స్థూల పర్యావరణ ఉత్పత్తి సూచీని ఉత్తరాఖండ్ రాష్ట్రం అందుబాటులోకి తెచ్చింది. ఈ తరహా సూచీని తయారు చేసిన తొలి రాష్ట్రం ఇదే. మానవుడి చర్యల మూలంగా పర్యావరణ నష్టం ఎంత జరుగుతుందో ఇందులో గణించి ప్రజలకు అవగాహన కల్పిస్తారు.

**పెరిగిన నికర ఎఫ్‌డీఐలు**

- 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్-జూన్ కాలానికి నికర ఎఫ్‌డీఐలు 6.9 బిలియన్ డాలర్లుగా ఉన్నాయని తాజాగా విడుదల చేసిన నివేదికలో ఆర్‌బీఐ పేర్కొంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి వచ్చిన ఎఫ్‌డీఐలు 4.7 బిలియన్ డాలర్లు మాత్రమే. తయారీ, ఆర్థిక సేవలు, కమ్యూనికేషన్ సేవలు, కంప్యూటర్ సేవలు శక్తి రంగాల్లో అధికంగా భారత్‌లో ఎఫ్‌డీఐలు ప్రవహించాయి.

**రాజ్యాంగ మ్యూజియం**



- దేశంలో రాజ్యాంగ తొలి మ్యూజియం ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీలో ఏర్పాటు చేయనున్నారు. హర్యానాలోని సోనిపేట్‌లో ఈ విశ్వవిద్యాలయం ఉంది. 'ది కాన్‌స్టిట్యూషన్ అకాడమీ అండ్ ది రైట్స్-ఫ్రీడమ్స్ మ్యూజియం' అని దీనికి పేరు. ఈ ఏడాది నవంబర్ 26న ఇది ప్రారంభం కానుంది. ఆ రోజు భారత రాజ్యాంగ దినోత్సవంగా ప్రతి సంవత్సరం నిర్వహిస్తారు. దేశంలో ఏర్పాటు కానున్న తొలి రాజ్యాంగ మ్యూజియం ఇదే.

**రెడ్డి ల్యాబొరేటరీ గిన్నిస్ రికార్డ్**

- డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీ గిన్నిస్ రికార్డ్ దక్కించుకుంది. మధుమేహం (టైప్-2)పై రోగులకు అవగాహన కల్పించేందుకు గ్లైసెమిక్ హ్యాపినెస్ అనే అంశంపై వైద్యుల నుంచి సూచనలతో పాటు సందేశాలను ఆహ్వానించారు. వాటిని సంస్థ ఆవరణలో ప్రదర్శించారు. దీన్ని అతిపెద్ద బ్రోచర్‌గా గిన్నిస్ రికార్డ్ గుర్తించింది.

## తెలంగాణ

**గద్దర్ పురస్కారాల కమిటీ**

- గద్దర్ పేరిట ఇవ్వనున్న పురస్కారాల విధి విధానాల రూపకల్పనకు ప్రభుత్వం కమిటీని నియమించింది. దీనికి ఛైర్మన్‌గా దర్శకుడు బీ నర్సింగరావు, వైస్ ఛైర్మన్‌గా వీ వెంకట రమణారెడ్డి (దిల్ రాజు)లను నియమించారు. సలహా సభ్యులుగా రాఘవేంద్రరావు, అందెశ్రీ, తమ్మారెడ్డి భరద్వాజ, అల్లు అరవింద్, గుమ్మడి వెన్నెల, తనికెళ్ల భరణి, సురేశ్ బాబు, చంద్రబోస్, ఆర్ నారాయణ మూర్తి, వందేమాతరం శ్రీనివాస్, అల్లాణి శ్రీధర్, సానా యాదిరెడ్డి, హరీశ్ శంకర్, యెల్లండి వేణు ఉన్నారు.



**విజ్ఞాన్ పురస్కారాలు**

- ఇద్దరు తెలుగు శాస్త్రవేత్తలు రాష్ట్రీయ విజ్ఞాన్ పురస్కారాలు-2024 అందుకున్నారు. హైదరాబాద్‌లోని భారత వరి పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్ఎల్ కృష్ణమూర్తి, మద్రాస్ ఐఐటీ ప్రొఫెసర్ డాక్టర్ రాధాకృష్ణ గంటికి విజ్ఞాన్ యువ శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డులను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అందజేశారు. లవణాన్ని తట్టుకొని నిలబడగలిగే ఆరు వరి వంగడాలను, లవణీయత, క్షారతలను తట్టుకొనే నాలుగు జన్యు రకాలను అభివృద్ధి చేసినందుకు కృష్ణమూర్తికి ఈ పురస్కారం దక్కింది. స్వదేశీ పరిజ్ఞానంతో 5జీ బేస్ స్టేషన్‌ను అభివృద్ధి చేసినందుకు మద్రాస్ ఐఐటీ ప్రొఫెసర్ రాధాకృష్ణ గంటి ఈ అవార్డును సొంతం చేసుకున్నారు. ఆయన అభివృద్ధి చేసిన 5జీ సాంకేతిక పరిజ్ఞానం వాణిజ్యపరమైన సెల్ ఫోన్లలో వినియోగించడానికి ఉపయోగపడింది. దీని వల్ల దేశ వ్యాప్తంగా పూర్తి స్వదేశీ 5జీ సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగంలోకి వచ్చింది. అలాగే డిజిటల్ ఫైళ్లను 50 రెట్లు కంప్రెస్ చేసే సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రపంచంలో తొలిసారి అభివృద్ధి చేశారు.

**యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ**

- రాష్ట్రంలో యంగ్ ఇండియా యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించనున్న ఫ్యూచర్ సిటీలోని స్పోర్ట్స్ హబ్‌లో దీన్ని ఏర్పాటు చేస్తారు. దాదాపు 200 ఎకరాల్లో స్థాపించనున్న వర్సిటీలో డజనుకు పైగా స్పోర్ట్స్ అకాడమీలు రానున్నాయి. ఇటీవల దక్షిణ కొరియా పర్యటనకు వెళ్లినప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సియోల్‌లోని కొరియన్ నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీని సందర్శించారు. 1976లో ప్రారంభించిన ఈ వర్సిటీ ప్రపంచంలోనే ప్రఖ్యాత క్రీడా వర్సిటీగా నిలిచింది. ఇటీవల పారిస్‌లో దక్షిణ కొరియా 32 పతకాలు గెలవగా, వాటిలో 16 పతకాలు కొరియన్ క్రీడా వర్సిటీ క్రీడాకారులే ఉన్నారు.

## వార్తల్లో వ్యక్తులు/ నియామకాలు

**శక్తికాంత దాస్**

- గ్లోబల్ ఫైనాన్స్ సెంట్రల్ బ్యాంక్ ఇచ్చే నివేదికలో ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్‌కు ఏ+ దక్కింది. ఈ ర్యాంక్ దక్కించుకోవడం వరుసగా ఇది రెండోసారి. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లోని కేంద్ర బ్యాంకుల సారథుల పనితీరును 100 ఆర్థిక అంశాల ఆధారంగా అంచనా వేసి ఈ ర్యాంకులను కేటాయిస్తారు.



**జైషా**

- దుబాయ్ కేంద్రంగా పనిచేసే అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్‌కు ఛైర్మన్‌గా జై షా బాధ్యతలు స్వీకరించనున్నారు. గ్రెగ్ బార్‌క్లే ప్రస్తుతం ఈ పదవిలో ఉన్నారు. ఆయన నవంబర్ 2024లో వైదొలిగిన తర్వాత జై షా బాధ్యతలు స్వీకరిస్తారు. ప్రస్తుతం ఆయన బీసీసీఐ సెక్రటరీగా ఉన్నారు. జై షాకు ఇంగ్లండ్, ఆస్ట్రేలియా తదితర క్రికెట్ బోర్డుల మద్దతు కూడా లభించింది.

**రాజేశ్ నంబియార్**

- నాస్కామ్ ప్రెసిడెంట్‌గా రాజేశ్ నంబియార్ నియమితులయ్యారు.



వి. రాజేంద్ర శర్మ
ఫ్యాకల్టీ
9849212411

